Mahilalu-Masjid
(Telugu)

# మహిళలు - మస్జిద్

సంకలనం

**జమాల్ బేగ్**

సాబిఖ ఇమామ్ వ ఖతీబ్, నెహర్ మస్జిద్,
తంగెళ్ళముడి, ఏలూరు

అనువాదం

**ముంతాజ్ బేగం**

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**
సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్
హైదరాబాద్-500 002.

మహిళలు - మస్జిద్

**Mahilalu-Masjid (Telugu)**

**TIP Series No.** : **223**

Compiled by : Jamal Baig

Translated by : Mumtaj Begum

All Rights Reserved with Publishers

First Edition : February 2009

Copies : 2000

**Price** : **Rs. 12**

ISBN : 978-81-88241-74-3

Published by : **Telugu Islamic Publications Trust** (Regd.)
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583
Fax : +91 +40 – 24576237
e-mail: tiphyderabad@rediffmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# నా మాట

పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో అల్లాహ్ దయవలన నెహర్ మస్జిద్ కమిటీ, ఏలూరు వారికి ఒక ఆదర్శవంతమైన మసీదు మరియు ఇస్లామీయ సెంటర్ స్థాపనకు అల్లాహ్‌తాలా ఒక మహత్తర అవకాశాన్ని కల్పించాడు. 2001లో ఆనాటి నాయబ్ అమీర్ జమాఅతె ఇస్లామీహింద్ మౌలానా అబ్దుల్ అజీజ్ గారి హస్తాలతో దానికి శంకుస్థాపన జరిగింది.

గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం పూర్తి అయినది. 2005లో శ్రీ సాంబశివరావు గారు ఎం.పి. ఒక విశాలమైన కాన్ఫరెన్స్ హాల్ నిర్మించి దానికి ప్రారంభోత్సవం చేశారు. ఇదే హాలులో ఒక లైబ్రరీ, ఒక బుక్ బ్యాంక్, ఎస్.ఐ.ఒ. ఆఫీసు 2005లో మౌలానా సిరాజుల్ హసన్ సాహెబ్ అమీరె జమాఅతె ఇస్లామీ హింద్ గారు దీనికి ప్రారంభోత్సవం చేశారు. ఇంకా జమాఅత్ ఆఫీస్, షొబయే ఖిద్మతె ఖల్క్, నెహర్ మసీదు ట్రస్ట్ ఆఫీస్ స్థాపించబడ్డాయి. తిరిగి 2008లో ప్రాంతీయ సందేశ ప్రచార విభాగం (దావా సెంటర్) మౌలానా మలిక్ మోతసిం ఖాన్ గారి (అమీరె హల్ఖా, ఆంధ్రప్రదేశ్ మరియు ఒరిస్సా) హస్తాలతో దీనికి ప్రారంభోత్సవం జరిగింది.

ఫస్ట్‌ఫ్లోర్‌లో ఒక విశాలమైన పెద్ద మసీదు నిర్మించబడింది. మహిళా విభాగం, జి.ఐ.ఒ. బాలికా విభాగం ఇజ్తెమాలు, వాటి ఆఫీసులు ఏర్పాటు చేయబడ్డాయి.

కొంతమంది మహాశయులకు స్త్రీలు మసీదుల్లో వచ్చి, జుమా, పండుగ నమాజులు (సలపటం గురించి) ఎలా చేస్తారు అనే విషయంలో అభిప్రాయ బేధమున్నది. ఈ విషయం గురించి ప్రజలలో చాలా భేదాభిప్రాయాలు, మూఢనమ్మకాలు ఉన్నాయి. దీనివల్ల మసీదులకు వచ్చే స్త్రీలపై దీని ప్రభావం పడుతుంది. స్త్రీలు మసీదులలో రావడం గురించి, నమాజ్ మరియు ఇతర శిక్షణ, తర్ఫీదులు పొందటం గురించి వివిధ విద్వాంసుల వివిధ అభిప్రాయాలు సేకరించి ఈ మూఢనమ్మకాలను, భేదాభిప్రాయాలను నివారించటానికి ప్రయత్నం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ప్రయత్నం కోసమే దీన్ని పుస్తకరూపంలో తీసుకురావడానికి ప్రయత్నం జరిగింది. దీనికి సానుకూల, ప్రతికూల ధోరణుల నుంచి జాగ్రత్త వహిస్తూ జనుల ముందుకు తీసుకురావడానికి కృషి జరిగింది. దీని ద్వారా భేదాభిప్రాయాలు దూరం అవ్వాలని, స్త్రీలు మసీదులలో నమాజ్ చేసే సద్భాగ్యం కలుగ చేయాలని అల్లాహ్‌ను వేడుకుంటున్నాను. ఇంకా అల్లాహ్‌తాలా ఏ మహానుభావులైతే ఈ విషయాలను వివిధ పుస్తకాలలో రాశారో, ప్రత్యేకంగా ముఫ్తీ కలీముర్రహ్మాన్ సాహెబ్ గారు ఈ సమస్యపై ఎంతో వివరణలతో కూడిన జవాబులను ఇచ్చారో వారందరినీ అల్లాహ్ అనుగ్రహించుగాక!



ఈ పుస్తకంలో ఏ మహానుభావుల వ్యాఖ్యానాలు పొందుపరచబడ్డాయో వారి పేర్లు క్రింద ఇవ్వబడ్డాయి.

1. అల్లామా యూసుఫుల్ ఖర్జావి, ప్రొఫెసర్ దోహా ఖతర్ యూనివర్శిటీ
2. మౌలానా సయ్యద్ అబుల్ ఆలా మౌదూదీ (రహ్మ)
3. మౌలానా అమీరుద్దీన్ మెహెర్ సాహెబ్, ముషీర్ (సలహాదారుడు), రీజనల్ దావా సెంటర్, కరాచీ.
4. మౌలానా సయ్యద్ జలాలుద్దీన్ సాహెబ్ ఉమ్రీ, అమీర్, జమాఅతె ఇస్లామి హింద్.
5. డాక్టర్ ముహమ్మద్ రజియుల్ ఇస్లామ్ నద్వీ.
6. డాక్టర్ ముహమ్మద్ అహ్మద్ ఫలాహీ.
7. డాక్టర్ జాకిర్ నాయక్
8. డాక్టర్ హసన్ తురాబీ
9. ముఫ్తీ కలీముర్రహ్మాన్ సాహెబ్

**జమాల్ బేగ్**

*సాబిఖ ఇమామ్ వ ఖతీబ్, నెహర్ మస్జిద్,*
*తంగెళ్ళముడి, ఏలూరు*

# ఆప్త పలుకులు

ఎవరైతే ప్రవక్త (స) ఆచరణను బ్రతికిస్తారో వంద అమరవీరుల పుణ్యము పొందుతాడని హదీసుల్లో రాయబడి ఉంది.

నెహర్‌మసీదు  కమిటీ వారు తమ మసీదులో స్త్రీలకు జుమా, పండుగల, ఖుత్బాలు, మసీదుల విద్యాశిక్షణ, సంస్కరణల ద్వారా లాభాలు పొందుటకు స్త్రీల కోసం చేసిన ఏర్పాట్లు ప్రవక్తల ఆచారాన్ని మళ్లీ బ్రతికించినట్టుంది. మహిళలకు మసీదు ప్రార్థన, విద్య, శిక్షణ పొందే కేంద్రం. వీరికి కూడా దీన్ ద్వారా లాభం పొందుటకు అవకాశాలు కల్పించినట్లయితే సత్సమాజ నిర్మాణంలో పురుషులకు  చాలా సహాయ సహకారాలు లభిస్తాయి. స్త్రీలు ధార్మికంగా చాలా వెనుకబడి ఉన్నారు. దీనికి ముఖ్య కారణం మసీదులతో వారి సంబంధం తెగి పోవడమే. ఈ పుస్తకంలో ప్రముఖ పండితుల వ్యాసాల ద్వారా ముఖ్యంగా హదీసుల్ని చేర్చి స్త్రీలకు మసీదుల్లో ప్రవేశం విషయమై ఏర్పడిన అపార్థాలు, అపోహలను తొలిగించుటకు కృషి జరిగింది. మన సోదరీ మణులు చదివి దీన్ని ఆచరిస్తారని, తోటి స్త్రీలకు అందజేస్తారని నా దృఢ నమ్మకం. ఎక్కడైతే స్త్రీలకు మసీదుల్లో ప్రత్యేక ఏర్పాటు ఉన్నదో అక్కడ స్త్రీ కనీసం జుమా నమాజు చేస్తూ ఇటువంటి ఏర్పాట్లు లేనిచోట కూడా అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తారని ఆశిస్తున్నాను. అల్లాహ్ మనల్నందరికి సహాయపడుగాక.

**సాజిదా సాలిహాతి**
**(ఆలిమా, మాలెగావ్)**
ఏలూరు



# అభినందనలు

ఇస్లామీయ చరిత్రలో మస్జిదుల పాత్ర చాలాప్రాముఖ్యతను సంతరించుకుంది. ఎందుకంటే అల్లాహ్ దాస్యం, ఖుర్‌ఆన్ పాఠాలు, హదీసు బోధనలు, ప్రవక్తల జీవిత చరిత్రలు తెలుసుకునేందుకు మస్జిద్‌లు ముఖ్యభూమిక పోషిస్తాయి.

పురుషులు, స్త్రీలు మస్జిద్‌లో నమాజ్ చేయడం దైవప్రవక్త (సల్లం) సంప్రదాయం.

మిత్రులు జనాబ్ జమాల్‌బేగ్ అహ్మద్ ఏలూరు వారు ఎంతో శ్రమకోర్చి, పుస్తకంలోని హదీసులను ఒకచోట జమచేసే ప్రయత్నం చేశారు. ఈ పుస్తకం ద్వారా ముస్లిం మహిళలకు జమాఅత్‌తో నమాజ్ ఆచరించే, దైవారాధన చేసే, ప్రసంగాలను వినే ప్రయోజనం పొందే అవకాశం కలుగుతుంది. జమాల్ బేగ్‌గారు ప్రవక్త (సల్లం) హదీసులను సేకరించి పుస్తక రూపంలో దీన్ని ప్రచురిస్తున్నందుకు అభినందనలు. అల్‌హమ్దులిల్లాహ్! దీన్ని ప్రచురించడంలో ఆయన సఫలులయ్యారు. అల్లాహ్ ఆయన కృషిని స్వీకరించుగాక (ఆమీన్)

**అబ్దుల్ అజీజ్**
మాజీ ఉపాధ్యక్షులు,
జమాఅతె ఇస్లామిహింద్

# ఆత్మీయ పలుకులు

'మహిళలు - మస్జిద్' ముఖ్యమైన, ఆవశ్యకమైన అంశం, ఈ అంశంపై జమాల్ బేగ్ మంచి పుస్తకాన్ని రాశారు.. పుస్తకంలో ఒకే అంశంపై చక్కని విద్యా సంపత్తిని చేర్చారు. మహిళల విద్యా, వివేచనా, సమాజాభి వృద్ధి కొరకు, నైపుణ్యాలను పెంపొందించడం కోసం మస్జిద్‌లు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. కాని కొన్ని కారణాల వల్ల భారత ఉపఖండంలో మహిళలు మస్జిద్‌కు వెళ్ళడాన్ని సమంజసం కాదనుకుంటారు. మహిళలు మస్జిద్‌లకు వెళ్ళవచ్చుని ఈ పుస్తకంలో ఆధారాలను అందించడం జరిగింది.

ఈ అంశంపై చర్చలు చేసే బదులు మహిళలను జాగృత పరచాలి. ఈ విషయాన్ని వారి ఇష్టానికి వదిలి పెట్టాలి. వాళ్లు సౌకర్యంగా భావిస్తే మస్జిద్‌లకు వెళతారు. మస్జిద్‌కు వెళ్లడం తప్పనిసరి అని మాత్రం అనుకోనూకూడదు. అనవసరం అని కూడా అనుకోకూడదు. కొత్త మస్జిద్‌లు నిర్మించేటప్పుడు మహిళల సౌకర్యార్థం వారికోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి. వారు వెళ్లే దారి కూడా వేరుగా కల్పించాలి. పురుషులు వెళ్లే దారి కూడా వేరుగానే ఉండాలి. ఏమైనప్పటికీ ఈ సందర్భంగా జమాల్‌బేగ్ గారు చేసిన కృషి అభినందనీయం. అల్లాహ్ ఆయన్ను అనుగ్రహించుగాక! ఆమీన్

**మలిక్ ముఅతసిమ్ ఖాన్**
అమీరె హల్ఖా
జమాఅతె ఇస్లామిహింద్,
ఆంధ్రప్రదేశ్ & ఒరిస్సా



చదవండి ఒక వారం
చదువుతారు ప్రతి వారం
సహజీవన భావనల పావురాయి
గీతురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad - 500 002.
Ph.: 24564583

# మహిళలు - మస్జిద్

## స్త్రీలు మసీదులలో సామూహిక నమాజ్ సలిపే విషయంలో షరీఅత్ పరమైన అనుమతి

గత సమాజాలలో స్త్రీలు మసీదులకు వెళ్లే విషయం దివ్యఖుర్ఆన్‌లో ఇలా ఉంది.

19వ సూరాలోని 16వ ఆయత్‌లో వివరింపబడింది.

**"వజ్‌కుర్ ఫిల్ కితాబి మర్‌యమ. ఇజిన్ తబజిల్ మిన్‌హలిహా మకానన్ షర్‌ఖియా ఫత్తఖజత్ మిన్‌దూనిహిమ్ హిజాబా"**

"ముహమ్మద్ (సల్లం) ఈ గ్రంథంలో మర్యం వృత్తాంతం ప్రస్తావించు. ఆమె ప్రజల నుండి వేరయి తూర్పు వైపున ఏకాంత కుహరంలోకి వెళ్లి తెరవేసుకుని కుర్చున్నది.

ఈ వాక్యానికి మౌలానా మూదూది గారు నోట్ ఈ విధంగా వ్రాసారు.

హజ్రత్ మర్యమ్ తల్లి ఒక మొక్కు మొక్కుకున్నది. దాని ప్రకారం ఆమె ఆరాధన కొరకు బైతుల్‌మఖ్దిస్‌లో కూర్చున్నారు. హజరత్ జకరియ్యా ఆమెకు సంరక్షకునిగా ఉన్నారని ఆలిఇమ్రాన్ సూరాలో తెలియజేయ బడింది. అక్కడ ఈ ప్రస్తావన కూడా వచ్చింది. హజ్రత్ మర్యం బైతుల్ మఖ్దిస్‌లోని ఒక మూలన ధ్యానంలో నిమగ్నమై కూర్చున్నారని కూడా ఆ సూరాలో ప్రస్తావించబడింది.

ప్రవక్త పదవీ కాలమంతటిలోను స్త్రీలు నమాజ్ కొరకు మసీదులకు వచ్చేవారు. కానీ హజ్రత్ ఉమర్ (రజి) తన భార్య మసీదుకు వెళ్లకపోతే మంచిదని అభిప్రాయపడ్డారు. 'స్త్రీలు మసీదులలో నమాజ్ చేయటం' అనేది ధర్మంరీత్యా సమ్మతమే. కానీ, ఆమె భర్త అనుమతి లభించినప్పుడే ఆమె వెళ్లగలదు. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా ప్రవచించారు: "మీలో ఎవరి భార్యఅయినా మసీదుకు వెళ్లదలచుకుంటే, దానికి అనుమతి వుంది. అకారణంగా ఎవరినీ ఆపకూడదు." (ముస్లిం, అప్సలాత్ బాబ్ ఖరూ జున్నిసా ఫిల్ మసాజిద్) హజరత్ ఉమ్మెసల్మా ఒకసారి ఎవరో స్త్రీతో తన వెంట్రుకలు చుట్టిస్తున్నది. ఇంతలో మసీదులో నుండి ఖుత్బా ప్రసంగం వినిపించింది. దైవప్రవక్త (సఅసం) ఇలా చెప్పసాగారు. "ఓ ప్రజలారా! హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) ఇది వినగానే "ఆపెయ్యి, ఆపెయ్యి ఎలా ఉన్నాయో అలాగే చుట్టివేయి" అని అన్నారు. దానికి ఆ స్త్రీ "అంత తొందరేమిటీ? ఇప్పుడేకదా 'ప్రజలారా' అన్నారు" అని అన్నది. అప్పుడు ఉమ్మెసల్మా (రజి) "ఎంత బాగా చెప్పారు. ఆలస్యం చేస్తే మనం మనుష్యుల లెక్కలోకి రాము" అని చెప్పి వెంటనే లేచి స్వయంగా జుట్టు కట్టేసి ప్రసంగం వినసాగారు.



ఈ సంఘటన ద్వారా స్త్రీలకు ఖుత్బా ప్రసంగం వినటానికి ఎంత ఆసక్తి వుండేదో తెలుస్తోంది.

## 'స్త్రీలు మసీదులలో తరావీహ్ నెరవేర్చుట

అల్లమా యూసుఫుల్ ఖర్జావీ గారు తన పుస్తకం "ఫతావా"లో ఇలా వివరిస్తున్నారు:

స్త్రీలు తమ ఇండ్లలో వుండి, రమజాన్ రాత్రులందు నమాజ్ సలుపుట చాలా మంచిది. మసీదులకు వెళ్లి నమాజ్ చేయటంలో వారి ఉద్దేశ్యం కేవలం తరావీహ్ నమాజ్ చేయటం మాత్రమే కాదు. ఇతర పుణ్యకార్యాలలో అంటే ఖుత్బా, తజ్కీర్, తద్రీస్ కార్యకలాపాలలో కూడా పాల్గొని ప్రయోజనం పొందాలి. ఇంకా ఒక జయ్యాద్ ఖారీ శ్రావ్యంగా చేసే ఖుర్ఆన్ పారాయణం వినే అవకాశం కూడా కలుగుతుంది. ఈవిధంగా స్త్రీలు మసీదులో నమాజ్ చదవటంతో పాటు ఇతర పుణ్యకార్యాలలో కూడా

పాలుపంచుకోవచ్చు. నేడు పురుషులు తమ స్త్రీలకు ధార్మిక విద్యను బోధించుటకు ఏమాత్రం శ్రద్ధ వహించరు. స్త్రీలు మసీదులకు వెళ్లి జమాఅత్‌తో నమాజ్ సలుపుటతో పాటు ధార్మిక విద్యకూడా నేర్చుకోవటం వారికి లాభదాయకం. ఒకవేళ వారు ఇంటిలోనే కూర్చుని వుంటే వారికి నమాజ్ పట్ల అభిరుచి కలగకపోవచ్చు. కాబట్టి ఎటువంటి పరిస్థితుల్లోనైనా స్త్రీ తన భర్త అనుమతితోనే మసీదులకు వెళ్లగలదు. వారి భర్తలు కూడా వారిని మసీదులకు వెళ్లకుండా నిరోధించరాదు, ఏదైనా షరీఅత్ పరమైన ఆటంకం ఉంటే తప్ప.

దైవప్రవక్త (సఅసం) "అల్లాహ్ దాసీలను మసీదులకు వెళ్లనీకుండా నిరోధించకండి" అని చెప్పారు.

ఇక్కడ నేను ఓ ప్రత్యేక విషయం గురించి ప్రజల దృష్టి మళ్లించటానికి ప్రయత్నం చేస్తున్నాను. కొంతమంది, స్త్రీల విషయంలో అవసరానికి మించిన అతిజాగ్రత్త వహిస్తూ ఉండేవారున్నారు. వారి మనసుకు కష్టంకలిగే విధంగా, మితిమీరిన ఆంక్షలు విధిస్తుంటారు. వారిని ఎటువంటి పరిస్థితులోను మసీదులకు వెళ్లటానికి అనుమతి ఇవ్వరు. ఈ రోజుల్లో మసీదుల్లో స్త్రీలకు ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయి. మహాప్రవక్త (సఅసం) కాలంలో స్త్రీల కొరకు ప్రత్యేక సదుపాయాలు ఉండేవి కాదు. ప్రస్తుత కాలంలో ప్రపంచంలో స్త్రీల కొరకు కొత్తజీవితం ద్వారం తెరచిపెట్టింది. నేటి స్త్రీలు తమ ఇండ్ల నుండి బయలుదేరి స్కూలు, కాలేజి, బజారు, ప్రతీచోటకు వస్తూపోతూ వున్నారు. కానీ ఈ భూమండలం మీద అత్యంత సురక్షితమైన ప్రదేశం, అంటే మసీదుకు వెళ్లటానికి నోచుకోలేక పోతున్నారు. మసీదులలో ఎటువంటి ఆటంకం లేకుండా, స్త్రీల కోసం కూడా ద్వారాలు తెరచి ఉంచాలని నేను మనస్ఫూర్తిగా కోరుతున్నాను. వారిని సదా మసీదులలో దర్స్ తద్రీస్ సమావేశాల్లో లాభం పొందే అవకాశం కల్పించాలి. స్త్రీలు కూడా మసీదులలో ప్రవేశించవలసిన రీతిలో ప్రవేశించాలి. **(ఫతావా, పేజీ 161/163 , రచన: అల్లమా యూసుఫుల్ ఖర్జావీ)**



**డాక్టర్ జాకిర్ నాయక్ తన పుస్తకం 'స్త్రీల హక్కులు నాడు-నేడు' అనే దానిలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఇలా చెబుతున్నారు:**

**ప్రశ్న: స్త్రీలకు మసీదులకు వెళ్లటానికి ఎందుకు అనుమతి లేదు?**

సమాధానం: ఇది ఒక కఠినమైన ప్రశ్న. ఎందుకంటే పూర్తి ఖుర్ఆన్‌లో ఎక్కడా స్త్రీలు మసీదులకు వెళ్లటానికి నిరోధించబడలేదు. హదీసులలో కూడా స్త్రీలను మసీదులలో నమాజ్ చేయటం నుండి నిరోధించబడలేదు. కొంతమంది ఒక ప్రత్యేక హదీసు గురించి చెప్తుంటారు. అందులో మహాప్రవక్త (సఅసం) స్త్రీల కొరకు మసీదులో నమాజ్ చదవటం కంటే ఇంటిలో నమాజ్ చేయటం మంచిది' అని ఉంది. కానీ ఇతర హదీసులను విస్మరిస్తున్నారు. మహాప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు. మసీదులలో జమాఅత్‌తో నమాజ్ చేయటం వల్ల 27 రెట్లు అధికంగా పుణ్యం లభిస్తుందని అన్నారు. అపుడు ఒక స్త్రీ ఇలా ప్రశ్నించింది. "ఓ ప్రవక్తా మాకు పాలు త్రాగే పసిపిల్లలు ఉన్నారు ఇంకా ఇంటి పనులు కూడా చేయాల్సి ఉంటుంది. మేము మసీదులకు ఎలా రాగలము." దానికి సమాధానంగా మహాప్రవక్త (సఅసం) "స్త్రీ కొరకు మసీదులకంటే ఇంటిలో, ఇంటి ముంగిట్లో కంటే ఇంటిగదిలో నమాజ్ చేయటం మంచిది, ఆమె పిల్లలు పసివారిగా ఉంటే లేదా మరేదైనా సమస్య ఉంటే. ఆమెకు మసీదులో జమాఅత్‌తో నమాజ్ సల్పినంత పుణ్యం లభిస్తుంది." వివిధ హదీసుల ద్వారా, స్త్రీలకు మసీదులలో ప్రవేశం నిషిద్ధం కాదని తెలుస్తుంది. ఒక హదీసులో అల్లాహ్ దాసీలను మసీదులకు రాకుండా నిరోధించవద్దని ఉంది. మరొక హదీసులో దైవప్రవక్త (సఅసం) భర్తలకు తాకీదు చేస్తూ "ఒకవేళ మీస్త్రీలు మసీదులకు వెళ్లదలిస్తే వారిని వారించకండి అని ఉంది. ఈ విధంగా వివిధ హదీసులలో స్త్రీలను మసీదులకు వెళ్లకుండా వారించవద్దనే ఆదేశాలున్నాయి. కాకపోతే షరీఅత్ ప్రకారం మసీదులలో స్త్రీలకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి. ఎందుకంటే స్త్రీలు పురుషులు కలసి పోవటాన్ని ఇస్లాం అనుమతించదు. వివిధ మతాలలోని ఆరాధనాలయాల్లో

ఏమి జరుగుతుందో మనకు తెలుసు. అక్కడ జనులు ఆరాధన కోసం తక్కువగా, దొంగచూపులు చూసుకోవటానికి ఎక్కువగా వస్తుంటారు. దాన్ని ఇస్లాం అనుమతించదు. మసీదులలో స్త్రీలకు తగిన ఏర్పాట్లతో పాటు, వారి ప్రవేశ మార్గాలు వేరుగా ఉంటే, వుజూ మొదలైన ఏర్పాట్లు వేరుగా వుంటే, స్త్రీలకు మగ నమాజీలకు ముందు కాకుండా వెనుక వుంటే, వారు నమాజ్ చేయగలరు.

నమాజ్‌లో మనం భుజానికి భుజం ఆనించి నిల్చుంటాము. స్త్రీల శరీర ఉష్ణోగ్రత పురుష శరీర ఉష్ణోగ్రత కన్నా ఎక్కువగా వుంటుంది. అని డాక్టర్ల అభిప్రాయం. ఒకవేళ స్త్రీలు కూడా పురుషులతోపాటు భుజానికి భుజం ఆనించి నిల్చుని వుంటే వారి ఏకాగ్రత చెదురుతుంది. అందుకనే స్త్రీలు వెనుక వరుసలలో నిలుచుంటారు. ఒకవేళ వీరు సౌదీ అరబ్‌కు వెళితే స్త్రీలు మసీదులకు రావటం చూస్తారు. వీరు అమెరికా కానీ లండన్ కానీ వెళితే అక్కడ కూడా స్త్రీలు మసీదులలో నమాజ్ చేస్తారు. కేవలం మన దేశంలో మరికొన్ని ఇతర దేశాలలో మాత్రమే స్త్రీలు మసీదులలో నమాజ్ చేయరు. హరం షరీఫ్‌లో, మస్జిదె నబవీలో కూడా స్త్రీలు రావటానికి అనుమతి ఉంది. మన దేశంలో కొన్ని మసీదులలో మాత్రమే స్త్రీలకు అవకాశమున్నది. మన దేశంలో మరిన్ని మసీదులలో స్త్రీలకు అవకాశం కలగాలని నేను కోరుకుంటున్నాను.

**("స్త్రీల హక్కులు" (పేజీ 93/94), రచయిత: డాక్టర్ జాకిర్ నాయక్)**

మౌలానా అమీరుద్దీన్ తమ పుస్తకం "దావత్ వ తబ్లీగ్ మే మస్జిద్ కా కిర్‌దార్" (ప్రచురణ కర్త ఇస్లామిక్ ఫౌండేషన్ ఢిల్లి)లో ఇలా వ్రాస్తున్నారు: "దైవప్రవక్త కాలంలో స్త్రీలు సాధారణంగా నమాజు కొరకు మసీదులకు వెళ్లేవారు. వారి వరుసలు పురుషుల వరుసలకు చివర్లో ఉండేవి. నమాజ్ ముగియగానే వారు తమ ఇండ్లకు వెళ్ళిపోయేవారు. పండుగ నమాజ్



కోసం ఈద్గాకు వెళ్లడం తప్పనిసరి. అంతేకాకుండా, రుతుస్రావం, పురిటి స్రావంతో అశుద్ధావస్థలో ఉండే స్త్రీలు కూడా మసీదుకు వచ్చేవారు. అయితే వారు నమాజ్‌లో పాల్గొనేవారు కాదు.

ఆ సందర్భంలో కొంత మంది స్త్రీలు దైవప్రవక్త (స)తో ఇలా విన్న వించుకున్నారు: "మీలో ఎవరి వద్దనైనా దుప్పటి లేకపోతే ఎలా? ఏం చేయాలి? అప్పుడు దైవప్రవక్త (స) మీస్నేహితురాళ్ళ వద్ద తీసుకుని కప్పుకుని మసీదుకు వచ్చేయండి" అని అన్నారు. (తిర్మిజి)

ఇబ్నెఅబ్బాస్ ఉల్లేఖనం ప్రకారం ఒక పండుగ సమయంలో ఆయన నమాజ్, ఖుత్బాల తర్వాత స్త్రీలవైపుకు వచ్చి వారికి హిత బోధచేశారు. అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టేందుకు ప్రోత్సహించారు. ఇంకా ఉల్లేఖకులు ఇలా అంటున్నారు: "స్త్రీలు తమ చెవుల వైపు చేతులు సారించి, ఆభరణాలు తీసి బిలాల్ (రజిఅన్)కు ఇచ్చారు...." ( ముత్త ఫిఖ్ అలైహి).

మహాప్రవక్త జీవితచరిత్ర వ్రాసేవారు, హదీసు సంకలనవేత్తలు స్త్రీలు మసీదులకు హాజరు గురించిన కారణాలు తెలియజేశారు. అందులో ఒకటి ముస్లింల గౌరవప్రతిష్టలను గురించి తెలియచేయటం. రెండవ విషయం విద్యా విషయిక తర్ఫీదు. కాబట్టి ఈ ఉద్దేశ్యంతో స్త్రీలు ఈద్‌గాహ్ లకు హజరయ్యేవారు.

మౌలానా మౌదూదీ గారు తమ "తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్" గ్రంథంలో ఇలా రాస్తున్నారు: మస్జిదె నబవీలో దైవప్రవక్త (సఅసం) స్త్రీల ప్రవేశం కొరకు వేరే ద్వారాలు ప్రత్యేకించారు. హజ్రత్ ఇబ్నెఉమర్ ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ''మీరు ఈ ప్రత్యేక మార్గం స్త్రీలకు కేటాయించండి" అని అన్నారు. ఇబ్నెఉమర్ (రజి) జీవితాంతం ఆ ద్వారం గుండా మసీదులోకి ప్రవేశించలేదు. జమాఅత్‌లో స్త్రీల వరుసలు పురుషుల వరుసలకు వెనుక ఉంచబడేవి. ఇంకా నమాజ్ ముగింపు సమయంలో సలామ్ చేసి వెనుకకు తిరిగిన తర్వాత కొంచెంసేపు ఆగేవారు.

ఎందుకంటే పురుషులు లేవక ముందే స్త్రీలు మసీదు నుండి వెళ్ళిపోవాలని. ( అహ్మద్, బుఖారి)

హ(జత్ ఉమ్మెసల్మా ఇలా వివరిస్తున్నారు: దైవప్రవక్త (స) నమాజ్ ముగించిన తరువాత స్త్రీలు తమ స్థానాలు వదిలి పైకి లేచేవారు. వారు మసీదు నుండి వెళ్ళిపోయేవరకు దైవప్రవక్త (సఅసం) తన స్థానంలో కొంచెం సేపు కూర్చునేవారు. ఇది ఆయన దినచర్య. ఉల్లేఖకులు ఇంకా ఇలా తెలియజేస్తున్నారు: "పురుషులు ఎదుట పడకూడదని స్త్రీలు ముందుగా లేచి వెళ్ళిపోవాలని దైవప్రవక్త (సఅసం) ఇలా చేసేవారు. ఆయన ఇలా ప్రవచించారు- "స్త్రీల వరుస అన్నింటికన్నా చివరి వరుసే మంచివరుస. వారి ముందు వరుస అన్నింటికన్నా చెడ్డ వరుస."

పండుగ నమాజ్‌లలో స్త్రీలు పాల్గొనేవారు. వారి స్థానం పురుషులకు వేరుగా వుండేది. దైవప్రవక్త (సఅసం) ఖుత్బా విన్పించిన తరువాత, స్త్రీల వైపు వెళ్ళి వారికి వేరుగా ఉపదేశించేవారు.

హ(జత్ ఉమ్మెఅతియా ఇలా అన్నారు: "పండుగరోజు అపరిశుద్ధావస్థలో ఉన్న స్త్రీలను, యుక్తవయసురాని బాలికల్ని తీసుకురండి. వారు ముస్లిం సముదాయంలోని భాగం. వారు కూడా దువాలో పాల్గొంటారు. అయితే వారు నమాజ్‌చేసే చోటుకు కొంచెందూరం వుండాలి" అని మాకు ఆజ్ఞాపించబడింది.

"జిందగీనౌ" మొదటి భాగంలో 2005 మార్చి సంచిక,35,36 పేజీలలో వ్రాశారు.."స్త్రీ పాపం అబల. ఆమె జీవిత కాలంతో జీవిత రంగం ధార్మిక అపోహలు ఎంతగా సంకుచితమై పోయాయంటే పురుషుల అధీనంలో అణిగి వున్నాయి. వారి ప్రాథమిక హక్కులు కూడా హరించబడ్డాయి, ఇంకా ఆమెకు బుద్ధిపరంగా అచేతనావస్థకు గురిచేశాయి. ఇక ఆమెకు ఈ హక్కు ఇప్పించటానికి ప్రయత్నం చేస్తే, ఈనాటి సాంప్రదాయిక ఉలమాలు దానికి విరుద్ధంగా పెద్దదుమారం లేపేస్తారు. ధర్మశాస్త్రం,



ఫత్వాలతో ప్రాచీన గ్రంథాల నుండి వాదనలు, సాక్ష్యాల పరంపర వెల్లువెత్తుతుంది... డాక్టర్ హసన్ తురాబీ ఒక వ్యాసంలో ముస్లిం స్త్రీల నడవడిక ఇస్లామీయ బోధనల వెలుగులో ఇలా వ్రాస్తున్నారు: సామాజిక జీవితం పురుషులు ఒంటరి పాత్రధారులుగా ఉండే రంగస్థలం కాదు. సామాజిక సమస్యలలో స్త్రీలు పురుషులు అని వేర్పాటు తగదు. ఇద్దరి సమిష్టి ప్రయత్నం అవసరం, స్త్రీ పురుషులిరువురు సాముహిక ఆరాధనలో పాల్గొనే నమ్మకం ఉంటుంది. మహాప్రవక్త (స) గారు ఇలా ప్రబోధించారు.

**"స్త్రీలను రాత్రి పూట మసీదులలో రానివ్వటానికి నిరోధించకండి"**

ఈ హదీసు విన్న తర్వాత అబ్దుల్లాబిన్ ఉమర్ (రజి)గారి ఒక కుమారుడు తండ్రితో ఇలా అంటాడు. "మేము దీని వల్ల కలగబోయే దుష్పరిణామాల దృష్ట్యా స్త్రీలను రాత్రి పూట ఇంటినుండి బయటకు వెళ్ళడానికి నిరోధించే వారము. ఇబ్నె ఉమర్ దీనిపై తన కుమారుణ్ణి హెచ్చరించి "నేను చెప్తున్నాను, అల్లాహ్ ప్రవక్త ఇలా ఉపదేశిస్తున్నారు. నీవేమో ఒక ఆదేశంగా వారిని వెళ్లనివ్వవని అంటున్నావు. స్త్రీ రాత్రికూడా వెళ్లగలుగుతుంది. ఈద్‌గాహ్‌కు కూడా వెళ్లి నమాజ్ చేయగలుగుతుంది.

ఆయన తన వ్యాసంలో మరోచోట ఇలా రాస్తున్నారు: స్త్రీ పురుషులు ఒక చోట గుమికూడితే వారు ఒకరికొకరు తగిలేంత దగ్గరగా ఉండరాదు. ఒకరి శ్వాస మరొకరికి తగిలేటట్లుగా ఉండరాదు. ఒక్కోసారి దగ్గరగా రావటం కూడా జరుగుతుంది. హజ్ కాలంలో వలే, కానీ స్త్రీ పురుషులు ఇంటిలో, బజారులో, సమావేశాల్లో వారి మధ్య వ్యత్యాసముండాలి. ఇదే నియమం ఆధారంగా సామూహిక నమాజ్‌లో స్త్రీలు, పురుషుల వరుసలు వేరుగా వుండాలి. నమాజ్ సమయంలో కూర్చున్నప్పుడు, లేస్తున్నప్పుడు, పురుషులు బాగా దగ్గరగా నుంచుంటారు. కాబట్టి వారిని, అల్లాహ్‌ను ఏమరుపాటుకు గురిచేసే అన్ని విషయాలకు దూరంగా వుంచాలి. మహాప్రవక్త (సఅసం) స్త్రీలు మసీదులలో ప్రవేశించడానికి, బయటకు రావటానికి ఒక ద్వారం నిర్ణయించారు. ఇబ్నెఉమర్ గారి ఉల్లేఖనం:

దైవప్రవక్త (స) “ఈ ద్వారం నుండి స్త్రీలు మాత్రమే లోపల నుండి బయటికి, బయట నుండి లోపలికి నడవాలి” అని అన్నారు. (అబూదావూద్)

మార్గాలలో నడిచే స్త్రీ పురుషులు మధ్య తగినంత దూరం ఉండాలి. హమ్జా బిన్ సయ్యదుల్ అన్‌సారి (రజిఅన్) తన తండ్రి నుండి గ్రహించిన ఉల్లేఖనం ప్రకారం, దైవప్రవక్త (సఅసం) ఒక స్త్రీతో “నీవు వేరుగా నిలబడు. దారి మధ్య నడవకు. దారికి ఒక పక్కగా నడవాలి” అని అన్నారు. ఆయన ఇంకా ఇలా సెలవిచ్చారు: “స్త్రీ దారికి పక్కగా ఉండే గోడలకు ఆను కుంటూ నడవాలి. ఆమె దుస్తులు గోడలకు తగులుతూ ఉండాలి.” “దైవప్రవక్త (స) నమాజ్ ముగించిన తరువాత స్త్రీలంతా బయటికి వెళ్లి పోవడానికి వీలుగా కాస్సేపు మసీదులో ఆగిపోయేవారు. (అబూదావూద్)

ఉమ్మె సల్మా (రజి) ఉల్లేఖనం: “దైవప్రవక్త (స) నమాజ్ ముగించగానే స్త్రీలు తమ స్థానాల నుండి లేచి బయటికి వెళ్ళిపోయేవారు. దైవప్రవక్త (స) వారు వెళ్ళిపోయే వరకు ఆగి, ఆ తరువాత లేచి బయటికి వెళ్ళేవారు. (మాహ్‌నామా జిందగీ నౌ ఆగస్టు 1999 సంచిక ఆధారంతో)

## మసీదులలో స్త్రీల రాక గురించిన సమస్య

“మస్జిద్‌లలో స్త్రీల ప్రవేశం, ప్రస్తుత కాలంలో మధ్యేమార్గం” పేరుతో 2001లో మౌలానా ముఫ్తీ కలీముర్రహ్మాన్ గారి వ్యాసం ఒకటి “జిందగీ నౌ”లో వచ్చింది. అందులో ఆయన ఇలా వ్రాస్తున్నారు:-

ఇండియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో ఖుర్ఆన్-హదీసుల జ్ఞానం అంతగా లేకపోవుట వలన ఇస్లామ్ యొక్క విషయాలు స్వయంగా ముస్లింలకు కొత్త విషయాలుగా, ఇస్లాంకు విరుద్ధమైనవిగా తెలుస్తున్నాయి. అందులో ఒకటి మసీదులలో స్త్రీల ప్రవేశం కూడా వుంది. ఈ సమస్య ఇస్లాంలో కొత్తది కాదు. ఇస్లాంవ్యతిరేకమైనది కాదు. ఇస్లాం ఎంత ప్రాచీనమైనదో ఇదీ అంతే ప్రాచీనమైనది. హదీసుల ద్వారా పగలు



రాత్రులలో 5పూటల నమాజులు ఎలా యదార్థమో, అలానే యదార్థము. ఐదు పూటల నమాజులను మనం ఏవిధంగా తిరస్కరిచలేమో అదే విధంగా ఈ సత్యాన్ని కూడా తిరస్కరించలేము.

ఒకవేళ స్త్రీలను మసీదులలోకి రానీయటం అనేది మసీదు గౌరవానికి భంగం అని భావిస్తే అన్నింటికన్న ముందు మస్జిదె హరాం ‘కాబా’ లోనికే రాకుండా నిరోధించేవారు. కల్లోలం దృష్ట్యా నిషేధమైతే కనీసం హజ్ సమయంలోనైనా వారిని మసీదులలో రానీయకుండా నిరోధించేవారు. అక్కడ ప్రపంచం నలుమూలల నుండి ముస్లిములు గుమిగూడుతారు. ఇస్లామీయ ఆరాధనలలోని పవిత్రమైన హజ్ ఆరాధనను నెరవేర్చే ప్రయత్నంలో వుంటారు. కానీ ప్రవక్త కాలంలోనూ స్త్రీలను మసీదుల నుండి నిరోధించలేదు. సహాబాల కాలంలోను, తాబయీన్ కాలంలోను దాని తర్వాత కాలంలోను నేటి నుండి ప్రళయం వరకు నిరోధించబడరాదు. కాబట్టి మస్జిదెహరాం విషయంలో ధర్మ సమ్మతమైనప్పుడు ఇతర మసీదుల్లో ఎలా ధర్మసమ్మతం కాజాలదు. ఇతర మసీదులన్నీ పవిత్రత, ప్రాముఖ్యతల దృష్ట్యా మస్జిదెహరాం కంటె తక్కువ స్థాయికి చెందినవి. చాలామంది ముస్లిములలో స్త్రీలు మసీదులలో వచ్చే విషయమై రెండు అపోహలు చోటుచేసుకున్నాయి. ఒకటి, పరదా ఆజ్ఞలు వెలువడిన తరువాత స్త్రీలను మసీదులలో ప్రవేశించే ఆజ్ఞ అంతరించిపోయిందనేది. రెండు, అమీరుల్ మోమినీన్ హజ్రత్ ఉమర్‌ఫారూఖ్ ఖిలాఫత్ కాలంలో స్త్రీలను మసీదులకు వచ్చే విషయమై ఒక నియంత్రణ విధించారనేది. కానీ ఈ రోజుల్లో అపోహలు, వాస్తవాలకి దూరం అన్న విషయం కూడ ఆలోచించతగినదే. మొదటి అపోహకు సంబంధమున్నంతవరకు దాని పొరపాటును సరిదిద్దు కోవటానికి ఈమాట చాలు- పరదా ఆజ్ఞలు హిజ్రత్ 5వ సంవత్సరంలో అవతరించాయి. కానీ స్త్రీలు ప్రవక్త నిర్యాణం వరకు, ఆ తరువాత కూడా ఏ ఆటంకం లేకుండా మసీదులకు వచ్చేవారు. కానీ తేడా ఏమిటంటే పరదా ఆజ్ఞలు అవతరించిన తరువాత స్త్రీలు పరదాలోనే

వచ్చేవారు. దానికి సాక్ష్యంగా హదీసులు ప్రవక్త జీవితచరిత్రలో ఇస్లామీయ చరిత్రలో, ఇతర పుస్తకాలలో వున్నాయి. మేమిక్కడ కొన్ని హదీసుల్ని పొందుపరుచుచున్నాం.

## బుఖారీ షరీఫ్‌లోని సంఘటన

హజ్రత్ ఆయెషా సిద్దీఖా (రజి) ఇలా వివరిస్తున్నారు: ప్రవక్త (సఅసం) గారు ఉదయాన్నే నమాజ్ చదివించగానే స్త్రీలు దుప్పట్లు కప్పుకొని తమ ఇండ్లకు తిరిగి వెళ్లిపోయేవారు. చీకటిలో వారిని గుర్తుపట్టలేము. ఈ వృత్తాంతం ద్వారా పరదా ఆజ్ఞలు వెలువడిన తర్వాత కూడా స్త్రీలు నమాజ్ చదవటానికి వచ్చేవారు అని తెలియచున్నవి. బుఖారీ షరీఫ్‌లోని మరొక హదీసులో హజ్రత్ హింద్ బింతె హారిస్ ద్వారా ఉల్లేఖించబడింది. వారికి హజ్రత్ ఉమ్మె సల్మా గారు వివరించారు. ఆమె ప్రవక్త సతీమణి. ప్రవక్త (సఅసం) కాలంలో స్త్రీలు ఫరజ్ నమాజు తరువాత సలాం చెప్పగానే లేచి వెళ్ళిపోయేవారు. దైవప్రవక్త (స), ఇతర పురుష నమాజీలు ఆయన వెనుక నమాజ్ సల్పిన ఇతర పురుష నమాజీలు ఆగివుండేవారు. అల్లాహ్ తలచినంత సేపు ఆగివుండేవారు. దైవప్రవక్త (సఅసం) లేవగానే పురుషులు కూడా లేచి వెళ్లిపోయేవారు. పురుషుల కంటబడకుండా స్త్రీలు వెళ్లిపోవాలనే ఉద్దేశ్యంతో ఇలా చేసేవారు.

మహాప్రవక్త (సఅసం) నమాజ్ తర్వాత మసీదులో వచ్చే స్త్రీల గురించి ఎంతగా బాధ్యత వహించేవారంటే బుఖారీ షరీఫ్‌లోని ఒక సంఘటన ద్వారా తెలుస్తుంది. హజ్రత్ అబ్దుల్లా బిన్ అబీ ఖతాదా అన్సారీ ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు: ''నేను నమాజ్ చేయటానికి నిల్చున్నపుడు సుదీర్ఘమైన నమాజ్ చేయాలని భావించేవాణ్ని. కాని ఈలోగా పిల్లల ఏడ్పులు విన్పించడంతో నమాజ్‌ని ముక్తసరిగా చేస్తాను. వారి తల్లులను కష్టంలో పడవేయడం నాకు ఇష్టం లేదు.'' మహాప్రవక్త(సఅసం) సామూహిక నమాజ్‌లో పాల్గొనే మహి



ళల బాగోగులను గురించి ఎంతగా పట్టించుకునేవారో ఈ హదీసును బట్టి మనం అంచనా వేయగలం. వారి కోసం ఆయన సుదీర్ఘ నమాజ్ చేయాలన్న తన కోరికను సైతం త్యాగం చేసేవారు.

పరదా ఆజ్ఞలవల్ల మసీదులలో స్త్రీలు వచ్చే విషయమై ఆజ్ఞలను రద్దుపరిచే ఉద్దేశ్యమేమంటే అల్లాహ్ స్వయానా రద్దుచేసేవాడు. అల్లాహ్ ప్రవక్త రద్దు చేసేవారు. కానీ అల్లాహ్ ఖుర్‌ఆన్‌లోని ఏ వాక్యంలోను స్త్రీలు మసీదులలో రాకుండా నిరోధించలేదు. అల్లాహ్ ప్రవక్త కూడా ఏ హదీసులోను నిరోధించలేదు. పైగా ఎన్నో హదీసులులో దైవప్రవక్త (స) స్త్రీలను మసీదులలోనికి రానివ్వండి, నిరోధించకండి అని ఆజ్ఞాపించారు. సుప్రసిద్ధ హదీసు గ్రంథం 'అబూదావూద్'లో హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) ఉల్లేఖించిన ఒక హదీసు ఉంది. దాన్ని మిష్కాత్ గ్రంథకర్త తమ పుస్తకం "మిష్కాత్ షరీఫ్"లో పేర్కొన్నారు. దాని ప్రకారం దైవప్రవక్త (సఅసం) "మీ స్త్రీలను మసీదులలోనికి రాకుండా నిరోధించకండి" అని అన్నారు.

ఈ హదీసుని బట్టి స్త్రీలను మసీదులకు రానీయకుండా వారించటం అంటే దైవప్రవక్త (సఅసం) ఆజ్ఞను ఉల్లంఘుంచటమేనని తెలుస్తోంది. హదీసులో 'వారించటం' అనే పదం వచ్చింది. సాధారణంగా ఆ పదం నోటితో వారించటానికి వాడబడుతుంది. దీనివల్ల స్పష్టంగా తెలిసేదేమంటే మహాప్రవక్త (సఅసం) స్త్రీలను మసీదులలో ప్రవేశించడాన్ని నోటితో ఆపే ప్రయత్నమే ప్రవక్త ఆజ్ఞను ఉల్లంఘించటమయితే, ఇక చేత్తో, బలంతో స్త్రీలను మసీదులలోనికి రాకుండా నిరోధించటం ఇంకెంత తీవ్రమైన ఉల్లంఘనో ఊహించండి. ఇదేవిధంగా బుఖారీ, ముస్లింల రివాయతులలో ఇబ్నెఉమర్ గారి ఉల్లేఖనంలో ఆయన ఇలా వివరించారు: రసూలుల్లాహ్ (సఅసం) గారు "మీలో ఎవరైనా తమ భార్య మసీదులకు వెళ్లే అనుమతి కోరితే ఆమెను ఏమాత్రం వారించకండి" అని అన్నారు. బుఖారి, ముస్లిం గ్రంథాలలోని ఈ హదీసును మిష్కాత్ గ్రంథకర్త కూడా నకలు చేశారు.

రెండవ అపోహ గురించి సంబంధం ఉన్నంత వరకు హజ్రత్ ఉమర్ ఫారూఖ్‌గారు ఖిలాఫత్ కాలంలో స్త్రీలను మసీదులకు రాకుండా నిరోధించారనేది హజ్రత్ ఉమర్ గారిపై పెద్ద అపవాదు. హజ్రత్ ఉమర్ (రజి) గారు తమ సతీమణి ఆతిక మసీదులోనికి రావటానికి ఇష్టం ఉండేది కాదు. అయినప్పటికీ ఆయన తన భార్యను మసీదులోనికి రాకుండా ఎప్పుడూ నిరోధించలేదు. బుఖారీ షరీఫ్‌లోని ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ గారు ఇలా అన్నారు: ఉమర్ గారి ఒక భార్య ఉదయం, ఇషా నమాజ్‌లలో జమాఅత్‌లో పాల్గొనేది. ఆమెను ఒకతను "మీరు (మసీదులలో నమాజ్ కోసం) బయటకు ఎందుకు వెళతారు? ఉమర్‌గారు ఇష్టపడరు అనే సంగతి మీకు తెలుసుకదా!" అని అడిగాడు. దానికి ఆమె "నేను మసీదుకు వెళ్లటం ఇష్టం లేకపోతే ఆయన నన్ను మసీదుకు వెళ్లకుండా ఎందుకు నిరోధించరూ?" అని అన్నారు. అప్పుడా మనిషి "మీరు అల్లాహ్ దాసీలను అంటే స్త్రీలను అల్లాహ్ మసీదులకు పోనీకుండా నిరోధించకండి' అన్న దైవప్రవక్త (స) ఆదేశం ఆయన్ని (అంటే ఉమర్‌ని) నిరోధించింది" అని అన్నాడు. ఉమర్ ఫారూఖ్ గారు మహాప్రవక్త (సఅసం) ఆదేశం ఆధారంగా తన భార్యను కూడా మసీదుకు వెళ్లకుండా నిరోధించలేకపోయారు. కానీ విచారకరమైన విషయం ఏమిటంటే ఆయన స్త్రీలందర్నీ మసీదుకు రాకుండా నిరోధించారని ఆయనపైనే జనులు అపవాదు లేవదీశారు.

దైవం క్షమించుగాక. వారు ఈ విషయం మరచిపోకూడదు. ఇలాంటి ఒక రోజు రానున్నది. దాన్ని ప్రళయం (ఖియామత్) అంటారు. అందులో సృష్టికి మూలకారకుడు, యజమాని, ఘనతకలవాడు మనుషుల మధ్య న్యాయం చేస్తాడు. ఒకవైపు హజరత్ ఉమర్‌గారు నిల్చుంటారు. ఆయన అల్లాహ్‌తో ఫిర్యాదు చేస్తారు. "నేను నా భార్యను మసీదుకు వెళ్లకుండా నిరోధించలేదు. కానీ కొందరు 'నేను అందరు స్త్రీలను మసీదులలో రాకుండా నిరోధించాన'ని నాపై అపవాదు సృష్టించారు. నీవు వారిని ఈ



అపవాదుకు శిక్షించు. ముఅత్తా, ఇమామె మాలిక్ గారి ఉల్లేఖనం ద్వారా కూడా స్పష్టంగా తెలియచున్నదేమంటే హజ్రత్ ఉమర్ తన భార్య ఆతికను కూడా మసీదుకు రాకుండా నిరోధించలేదు.

హజరత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ భార్య హజరత్ ఆతిక బింతె జైద్ బిన్ ఉమర్ గారి ఉల్లేఖనం ఏమిటంటే, ఆమె ఉమర్ బిన్ ఖత్తాబ్ గారిని మసీదుకు వెళ్లటానికి అనుమతి అడిగారు. దానికి ఉమర్‌గారు మౌనం వహించారు. అప్పుడామె "అల్లాహ్ సాక్షి! నేను మసీదుకు తప్పకుండా వెళతాను, ఒకవేళ మీరు నన్ను నిరోధిస్తే తప్ప" అని అన్నారు. అందువల్లనే ఉమర్ (రజిఅన్) గారు ఆమెను మసీదులకు వెళ్లకుండా నిరోధించలేదు. పైనుదహరించిన రెండు రివాయతులలో హజరత్ ఉమర్ గారి ప్రవక్త అనుసరణ, సున్నత్ పట్ల గౌరవం ఎంత వుందో తెలుస్తుంది. ఆయన తన పౌరుషాన్ని, ఇష్టాన్ని మహాప్రవక్త ఆదేశం కోసం త్యాగం చేశారు. హజరత్ ఉమర్‌గారి ఈ ఆచరణలో నామమాత్రపు విశ్వాసుల కోసం ఒక గొప్ప గుణపాఠం వుంది. వారు తమ, తమ కుటుంబ పౌరుషం కోసం జమాఅత్, మస్లక్‌ల పరమైన దురభిమానంలో పడిపోయి శాఖల, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తల అనేక ఆజ్ఞలను ఘోరంగా కాలరాస్తున్నారు.

రివాయతులలో ఇంకా ఇలా సెలవియ్యబడింది: హజరత్ ఉమర్ ఫారుఖ్‌గారు ఏ సమయంలో మసీదులో వధింపబడ్డారో అదే సమయంలో, అంటే ఫజర్ వేళ ఆయన భార్య ఆతిక అక్కడే ఉన్నారు. హజ్రత్ ఉమర్ గారు అదే గాయంతో అమరగతులయ్యారు. (ఫతహుల్ బారీ 2వ భాగం)

దీనివల్ల తెలిసేదేమంటే హజరత్ ఉమర్‌గారు చివరి శ్వాస వరకు కూడా తన భార్యను మసీదులోనికి రానీయకుండా నిరోధించలేదు. ఆయన హజరత్ ఉమర్ ఫారూఖ్ గారు ఆతికాకి భర్త మాత్రమే కాదు అమీరుల్ మోమినీన్ కూడాను. ఇంకా రివాయాతులలో తెలిసేదేమంటే హజరత్ ఉమర్‌గారి ఈ అయిష్టత కేవలం తనభార్య ఆతికా కొరకే. కానీ

స్త్రీలందరి కోసం కాదు. దీనిక్కారణము హదీసు పుస్తకాలలో హజ్రత్ ఉమర్ గారి పౌరుషం అని పేర్కొనబడినది. కానీ ఈ సమస్య గురించి దీర్ఘంగా ఆలోచించినట్లయితే హజరత్ ఉమర్ గారి పౌరుషం, ఆత్మాభిమానములతో పాటు, ఇంకొక అవసరం గురించి కూడా తెలియచున్నది. అది ఏమిటంటే హజ్రత్ ఉమర్ ఆతీకాకి కేవలం భర్త మాత్రమే కాదు. ముస్లింల ఖలీఫా కూడాను. ఇంకా ఖిలాఫత్ పదవి అర్హత పటిష్టం చేయాలంటే ఒక ఖలీఫాకు చాలా విషయాలు ఖిలాఫత్ వ్యతిరేకుల నుండి రహస్యంగా వుంచవలసి వస్తుంది. ఎందుకంటే ప్రవక్త కాలంలో, ప్రవక్త సహాబాల కాలంలో కొంతమంది మునాఫిఖ్ పురుషులు మసీదులలో నమాజ్ చదవటానికి వచ్చేవారు. అదే మార్గాన కపట విశ్వాసులైన స్త్రీలు కూడా మసీదులకు వచ్చేవారు. మునాఫిఖ్ పురుషులైతే వారి వైఖరి వల్ల తెలిసిపోయేది ఎలాగంటే వారు ఇస్లామీయ ధర్మయుద్ధాలలో పాల్గొనలేదు. ఒకవేళ పాల్గొన్నా ఇస్లామీయ సైన్యంలో విభేదాలు సృష్టించటానికే వచ్చేవారు. ఈ విధంగా వారి గుర్తింపు ఏదో ఒక విధంగా జరిగిపోతుంది. కానీ స్త్రీలపై యుద్ధం తప్పనిసరికాదు. అందువల్లే ముస్లిం స్త్రీలతోను కపట విశ్వాసుల స్త్రీలతోను బేధం చేయడానికి ప్రత్యక్షంగా ఏ గుర్తింపూ లేదు. కానీ వారిని గుర్తించటం చాలా కష్టం అయ్యేది.

కాబట్టి హజ్రత్ ఉమర్ గారికి ఎల్లప్పుడూ ఇదే విషయంలో సందేహం ఉంటూ వుండేది, అదేమిటంటే కపట విశ్వాసులు యూదులు, క్రైస్తవులు, ముష్రిక్కులతో రహస్యంగా ఉంచవలసిన విషయాలు తన భార్య ఆతికా ద్వారా, ముష్రిక్కు స్త్రీలు పొందకూడదనేది. కాని తన భార్య ఆతికాకు ఈ విషయం గురించి ఏ మాత్రం తెలియకూడదని హజ్రత్ ఉమర్ గారికి, తన భార్య ఆతికా మసీదులో నమాజ్ కోసం వెళ్లకపోతే బాగుంటుందని ఉండేది. ఎందుకంటే కపట విశ్వాసులైన స్త్రీలకు ఆమెతో మాట్లాడే అవకాశాలు దొరకరాదని భావించేవారు. ఈ సందేహం ఉన్నప్పటికి కూడా ఆయన ఎప్పుడూ తన భార్యను మసీదుకు వెళ్లటానికి నిరోధించలేదు.



మహాప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి "స్త్రీలను మసీదులలో వెళ్లడాన్ని నిరోధించకండి" అనే ఆదేశాన్ని ఇతర సహబాలు కూడా చాలా గౌరవించేవారు. ఈ విషయంలో కొన్ని రివాయతులలో ఈ సమస్య గురించి ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వబడినది. సుప్రసిద్ధ హదీసు పుస్తకం ముస్లిం షరీఫ్‌లోని రివాయతులో, మిష్కాత్ షరీఫ్‌లో కూడా వివరించారు. బిలాల్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ ఇలా ఉల్లేఖించారు: తన తండ్రిగారైన హజరత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) తనతో, "దైవప్రవక్త (సఅసం)గారు "మీరు మీ స్త్రీలను మసీదులలో వారి హక్కు నుండి వంచితులుగా చేయకండి వారు మిమ్మల్ని అనుమతి కోరితే" అని అన్నారు. దీనికి బిలాల్ గారు "మేము వారిని మసీదులకి వెళ్లటానికి నిరోధిస్తే?" అని అన్నారు. దానికి బిలాల్ తండ్రిగారు హజ్రత్ అబ్దుల్లా "నేను దైవప్రవక్త ఆదేశించారని చెప్తుంటే, నీవేమో మేము వారిని నిరోధిస్తామని అంటున్నావు" అని అన్నారు.

హజరత్ సాలమ్ గారి ఉల్లేఖనం ఏమిటంటే ఆయన తన తండ్రి గారి ద్వారా ఇలా ఉల్లేఖించారు: హజరత్ అబ్దుల్లా గారు తన కుమారుడు బిలాల్ వైపు తిరిగి బాగా కోప్పడ్డారు. ఇంతకు ముందు ఇంతగా కోప్పడటం నేనెప్పుడూ చూడలేదు. "నేను నీకు ప్రవక్తగారి హదీసు వినిపిస్తున్నాను. నీవేమో అల్లాహ్ సాక్షి, మేము వారిని తప్పకుండా నిరోధిస్తాం అంటున్నావు" అని అన్నారు.

పైన పేర్కొన్న రివాయతులలో రెండు ముఖ్యమైన విషయాలు తెలిశాయి. ఒకటి దైవప్రవక్త (సఅసం) స్త్రీలను మసీదులకు రావడాన్ని వారి హక్కుగా నిర్ణయించారు. వారికి వారి హక్కు పొందటానికి నిరోధించడాన్ని తిరస్కరించారు.

రెండవ విషయం ఏమిటంటే ప్రవక్త అనుచరులు ప్రవక్త గారి ఆదేశాన్ని కనీసం నోటితో తిరస్కరించటాన్ని కూడా సహించరు., ఎంతటి దగ్గర సంబంధీకులైనా సరే. కాబట్టి హజరత్ రసూల్ (సఅసం) గారి అనుచరుడు

హజరత్ అబ్దుల్లాగారు ప్రవక్త గారి హదీసును వివరించారు, "స్త్రీలను మసీదులకు వెళ్లడాన్ని నిరోధించకండి" అని. అప్పుడు మీ కుమారుడు బిలాల్ గారు "మేము నిరోధిస్తాము" అన్నాడు. దీనిపై హజరత్ అబ్దుల్లాగారు తన కుమారుడ్ని ఎన్నడూ లేనంత గట్టిగా మందలించారు. ఆయన ఉమర్‌ఫారూఖ్ గారి కుమారుడైన హజరత్ అబ్దుల్లాహ్‌యే. దీని వలన కూడా, హజ్రత్ ఉమర్‌గారు స్త్రీలను మసీదులకు రావటాన్ని నిరోధించలేదని, ఒకవేళ నిరోధిస్తే అందరికంటే ముందు తన కుమారునిపై దీన్ని ప్రతిపాదించేవారు, అమలు చేయించేవారు.

మరొక హదీసు పుస్తకం ముస్నద్ అహ్మద్ యొక్క రివాయతు ద్వారా కూడా ఈ సమస్యపై ప్రవక్త అనుచరుడైన హజరత్ అబ్దుల్లా బిన్ ఉమర్‌గారి ప్రవక్త (ఆచరణ) అనుసరణ గురించి ఆసక్తి తెలుస్తుంది. ఈ రివాయతును కూడా మిష్కాత్ గ్రంథకర్త తన పుస్తకం మిష్కాత్ షరీఫ్‌లో వివరించారు. హజరత్ ముజాహిద్ గారి ద్వారా ఉల్లేఖించారు. "ప్రవక్త (సఅసం) గారు ఇలా వివరించారు: "ఏ వ్యక్తి అయినా తన ఇంటి వారిని మసీదులకు రావడాన్ని ఏమాత్రం నిరోధించవద్దు. దీనిపై హజరత్ అబ్దుల్లా బిన్ ఉమర్ గారి కుమారుడైన బిలాల్ మేము నిరోధిస్తాము వారిని అంటే స్త్రీలను) అని అన్నారు. అప్పుడు హజ్రత్ అబ్దుల్లాగారు తన కుమారుడ్ని హెచ్చరించారు. నేను నీకు రసూల్ (సఅసం) గారి హదీసు వినిపిస్తున్నాను. నీవు నీ సంగతి చెప్తున్నావు. హజరత్ ముజాహిద్ గారు, ఇలా వివరిస్తున్నారు. "దాని తర్వాత హజ్రత్ అబ్దుల్లా గారు తన కుమారునితో చాలా రోజుల వరకు, ఆ విషయాలు పూర్తిగా తేలనంత వరకు మాట్లాడలేదు. ప్రవక్తగారి అనుచరుని ఈ సంఘటన ద్వారా గుణపాఠం నేర్చుకోవాలి. "ఒక వైపు ప్రవక్త పట్ల విధేయత అంటూ గొప్పలు చెప్తారు. కానీ మరోవైపు వారి ముందు స్త్రీలను మసీదులలో రావటం గురించిన ఆదేశం వినిపిస్తే, కోపంతో ఊగిపోతారు. ఈ సంఘటన వెలుగులో వారు తమ స్థాయిని నిర్ణయించుకోవాలి.



మరొక గొప్ప సహాబీ హజ్రత్ జుబేర్ గారి ప్రవర్తన ద్వారా కూడా, మసీదులలో స్త్రీల ప్రవేశం గురించిన ప్రవక్తగారి ఆదేశం యొక్క ప్రాముఖ్యం తేటతెల్లమవుతుంది. రివాయతులలో హజ్రత్ జుబేర్ గారికి, తన భార్య ఆతికా మసీదులకు వెళ్లటం ఇష్టం ఉండేది కాదు. కానీ "మీరు మీ స్త్రీలను మసీదులకు వెళ్లటాన్ని వారించకండి" అనే ప్రవక్త ఆదేశం వల్ల ఆయన తన భార్య ఆతికాను మసీదులకు వెళ్లటానికి నిరోధించేవారు కాదు. గమనించదగ్గ విషయం ఏమిటంటే ఈ ఆతికా గారు పూర్వం హజ్రత్ ఉమర్ ఫారూఖ్ గారి నికాహ్‌లో ఉన్నారు. ఆయన మరణానంతరం హజ్రత్ జుబేర్ గారి నికాహ్‌లోకి వచ్చారు. హజ్రత్ జుబేర్‌గారు "అష్‌రయె ముబష్షిరా" 10మంది స్వర్గవాసులలో గణింపదగిన వారు. ఈ పదిమంది సహాబాలను అల్లాహ్ ప్రవక్త గారు ఇహలోకంలోనే స్వర్గం గురించిన శుభవార్తను వినిపించారు. ఈ సంఘటన ద్వారా కూడా సహబాలు తమ స్త్రీలను మసీదుల నుండి నిరోధించడాన్ని ఎంతగా భయపడేవారో, జాగ్రత్త వహించేవారో తెలుస్తుంది. అంతటి గొప్ప సహాబీ కూడా తన భార్యను నోటితో నిరోధించే సాహసానికి ఒడిగట్ట లేదు. తమ స్త్రీలను మసీదుకు పోనీకుండా నిరోధించడం గొప్ప సాహసకార్యంగా, ఘనకార్యంగా, చాలా మంచిపనిగా భావించేవారు ఈ సంఘటన ద్వారా గుణపాఠం గ్రహించాలి.

కొంతమంది దైవప్రవక్త (సఅసం)గారి ఈ క్రింది హదీసును ఆధారంగా చేసుకొని, స్త్రీలను మసీదుల నుండి నిరోధించే విషయమై మాట్లాడుతారు. ఇది అబూదావూద్‌లో ఉంది. మిష్కాత్ గ్రంథకర్త కూడా దాన్ని మిష్కాత్ షరీఫ్‌లో వివరించారు. హజ్రత్ ఇబ్నే మస్‌ఊద్ (రజి) దాన్ని ఉల్లేఖించారు. ఆయన ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు: "స్త్రీ నమాజ్ తన ఇంటి ప్రాంగణంలో చేయడం కంటే తన ఇంటిలో చేయడం శ్రేష్ఠం; ఇంటి (ముందు గది)లో చేయడం కంటే ఇంటి (లోపలి గది)లో చేయడం శ్రేష్ఠం."

పైనుదహరించిన హదీసులో రసూల్ (సఅసం) గారు ఎక్కడ కూడ, మసీదునమాజ్, ఇంటినమాజ్ గురించిన పోలిక చేయలేదు. అంటే ఇంటిలో నమాజ్, మసీదులో నమాజ్ కంటే శ్రేష్ఠమైనదని చెప్పలేదు. ఇంటి ప్రాంగణంలో చేసే నమాజ్ కంటే ఇంటిలో చేసే నమాజ్ శ్రేష్ఠమైన దని మాత్రమే చెప్పారు. అందులో పరదా విషయమై భద్రత ఉంటుంది.

పైనుదహరించిన హదీసులో ఈ విషయానికి ఆస్కారముంది. ఇంకా ఎక్కువగా మహాప్రవక్త ఆదేశానికి ఫరజ్ నమాజులు కాని విషయంలో అంటే నఫిల్ నమాజుల గురించి ఆస్కారముంది. ఈ విషయం వివిధ హదీసుల ద్వారా నిరూపితమైంది. ఫరజ్ నమాజులే కాకుండా నఫిల్, సున్నత్ నమాజులు వారు మసీదుకంటే ఇంటిలో చదవడం చాలామంచిది. పురుషులు కూడాను, స్త్రీలు కూడాను.

ఒకవేళ, పైనుదహరించిన హదీసు ఫరజ్ నమాజుల గురించి సూచన అని భావిస్తే, ముఖ్యంగా ఈ విషయం తెలిసేదేమంటే "స్త్రీలు ఇండ్లలో నమాజ్ చదవటం గురించి ప్రోత్సాహం, కానీ ప్రోత్సాహం, ఆదేశం ఈ రెండింటిలో చాలా తేడా వుంది. మహాప్రవక్తగారి రెండు హదీసుల ద్వారా, ప్రోత్సాహం గురించిన వాస్తవికత స్పష్టమవుతుంది. హజరత్ జైద్‌బిన్ సాబిత్ గారి ద్వారా ఉల్లేఖించబడింది. మహాప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు. ఫరజ్ నమాజులు తప్ప, ఇతర నమాజులు తన ఇంట్లో చదవడటం, మసీదులో (మస్జిద్) నమాజ్ చదవటం కంటే శ్రేష్టం. ఈ హదీసులో అల్లాహ్ ప్రవక్త ఫరజ్ నమాజులు తప్ప ఎన్ని సున్నత్ నమాజులైతే ఉన్నాయో, వాటిని మసీదులో కంటే ఇంటిలో చదవటం ఉత్తమం. తన మసీదు మస్జిదె నబవీ వైపు సూచిస్తూ, దానిలో కూడా నఫిల్ మొదలైన నమాజులు చదవటం కంటే ఇంటిలో చదవటం ఉత్తమం అని అన్నారు. మస్జిదె నబవీ గురించి మహాప్రవక్త గారి ఆదేశం ఏమిటంటే, ఈ మసీదులో చదివే ఒక్క నమాజు, ఇతర మసీదులలో చదివే యాభైవేల నమాజులతో సమానం.



అందుకే మహాప్రవక్త గారు, ఆయన అనుచరులు సాధారణంగా నఫిల్, సున్నత్‌లు ఇంటిలో ఆచరించేవారు. అయినప్పటికీ మసీదులలో నఫిల్, సున్నత్ నమాజులు సలపటం అధర్మం, అసంబద్ధం అని చెప్పలేదు.

మహాప్రవక్త (సఅసం) రమజాన్ మాసంలో మస్జిదె నబవీలో కొన్ని రాత్రులు సహాబాలకు తరావీహ్ నమాజ్ చదివించారు. తరావీహ్ నమాజ్ ఫరజ్ నమాజ్ కంటే అదనం. కానీ సహాబాల ఉత్సాహం ఇనుమడిస్తుండగా ఆయన "ఈ తరావీహ్ నమాజ్ ఎక్కడ ఫరజ్ గావింపబడుతుందోనని నాకు భయంగా వుంది. కాబట్టి ఈ నమాజ్‌ని మీరు మీ ఇళ్లలో చదవండి" అని అన్నారు. (బుఖారి, ముస్లిం). సహబాలు అల్లాహ్ రసూల్ యొక్క ఈ ఆదేశాన్ని విని దాన్ని విశ్వసించేవారు. అదేమిటంటే ఫరజ్ నమాజ్‌లు తప్ప మనిషి తన ఇంటిలో నమాజ్ చదవడాన్ని మస్జిదె నబవీలో నమాజ్ చదవటం కంటే శ్రేష్ఠమైనది అని విశ్వసించేవారు.

హ్జ్రత్ ఉమర్‌గారి ఖిలాఫత్ కాలంలో మస్జిదె నబవీలో రమజాన్ నెలలో తరావీహ్ నమాజ్ జమాఅత్‌తో పాటు (పాటించేవారు) సలిపేవారు. (బుఖారి) పైనుదహరించిన హదీసు ద్వారా తెలిసే విషయం ఏమిటంటే ఏవిధంగానైతే అల్లాహ్ ప్రవక్త గారి ప్రోత్సాహం వల్ల ఎవరైనా తన ఇంటిలో సున్నత్, నఫిల్ నమాజులు చదవటం, మసీదులో చదవటంకంటే ఉత్తమమో, మనిషి సున్నత్, నఫిల్ నమాజులు మసీదుల్లో చదవటం అసంగతం, అవాంఛనీయం కాదో అదేవిధంగా మహాప్రవక్త గారి ఈ ఆదేశం స్త్రీ తన ఇంటిలో చదివే నమాజ్, ఇంటి ప్రాంగణంలో చదివే నమాజ్‌కంటే శ్రేష్ఠమో, స్త్రీలు మసీదులో నమాజ్ చదవటం కూడా అసంగతం అసంబద్ధం కాదు. కొంతమంది హ్జ్రత్ ఆయిషా (రజి) గారి ఒక అభిప్రాయాన్ని ఆధారంగా చేసుకుని స్త్రీలను మసీదులకు వెళ్లటాన్ని నిరోధించే విషయమై చెప్తుంటారు. హ్జ్రత్ ఆయిషా గారు ఈ అభిప్రాయాన్ని సువాసన పూసుకుని మసీదులకు వచ్చే స్త్రీలను దృష్టిలోనుంచుకొని చెప్పారు. మహాప్రవక్త (సఅసం) స్త్రీలను వారు ఇంటి నుండి ఏదేని అవసరార్థం బయటకు

వెళ్లాల్సి వస్తే సువాసన పూసుకోరాదు, అలంకరించుకొని వెళ్లరాదని ఆదేశించారు. ఆ అవసరం మసీదులో నమాజ్ చదవటం కోసం అయినా సరే వేరే ఇతర అవసరం అయినా సరే. హజ్రత్ ఆయెషాగారి ఈ అభిప్రాయం బుఖారీ షరీఫ్‌లో హజ్రత్ యహ్యా బిన్ సయీద్ గారి ఉల్లేఖనం ఈ విధంగా పేర్కొనబడింది: ఆయన ఉమరా బిన్తె అబ్దుర్రహ్మాన్ గారి ద్వారా ఉల్లేఖించారు. ఆమె అంటే హజ్రత్ ఆయెషా గారు, "స్త్రీలు నేడు ఎలాంటి పరిస్థితుల్ని కల్పించారో (అంటే సువాసన పూసుకుని అందంగా అలంకరించుకుని మసీదులకు వస్తున్నారు) వారిని అల్లాహ్ ప్రవక్త మసీదుల్లో చూస్తే వారిస్తారు, బనీఇస్రాయీల్ స్త్రీలను మసీదులలో వెళ్లడాన్ని వారించినట్లు" అని అన్నారు. యహ్యా బిన్ సయీద్ ఈ హదీసు విని "బనీఇస్రాయీల్ స్త్రీలు మసీదులకు వెళ్ళడాన్ని వారించబడ్డారా?" అని అడిగారు. దానికి ఉమ్రా అవునన్నారు.

పైనుదహరించిన రివాయతులో హజరత్ ఆయెషాగారి ఆచరణ, సున్నత్ పట్ల గౌరవం గురించి తెలుస్తుంది. మసీదుల్లో వచ్చే స్త్రీల అజాగ్రత్త, గమనించికూడా హజరత్ ఆయెషాగారు స్త్రీలను మసీదులకు వెళ్ళటాన్ని నిరోధించలేదు. "దైవప్రవక్త ఈ స్త్రీలను ఈ పరిస్థితిలో చూస్తే వారిని వారించేవారని మాత్రమే తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఎందుకంటే అల్లాహ్ ప్రవక్తయే స్త్రీలను మసీదులలో స్త్రీలు రావడాన్ని నిరోధించకపోతే, అల్లాహ్‌దాసి అయిన నాకు మసీదులకు స్త్రీలను రావడాన్ని నిరోధించడానికి ఏం హక్కువుంది" అని అన్నారు ఆమె. కాబట్టి పైనుదహరించిన ఉల్లేఖనాన్ని బట్టి స్త్రీలను మసీదులలో రావడాన్ని నిరోధించడానికి ఎలాంటి కారణాలు, ఆధారాలు లేవు. ఒకవేళ హజ్రత్ ఆయిషా (రజి) ఆ స్త్రీలను మసీదుల నుండి నిరోధిస్తే వారి ఈ చర్య ఎవరైతే సువాసన పూసుకుని, అందంగా అలంకరించుకుని మసీదులకు వస్తారో ఆస్త్రీలను మసీదుల నుండి నిరోధించటానికి ఒక ఋజువు అవుతుంది. కానీ వాస్తవిక పరిస్థితి ఏమంటే హజ్రత్ ఆయిషా గారు ఇలాంటీ స్త్రీలను కూడా మసీదుల



నుండి నిరోధించే ప్రయత్నం చేయలేదు. ముస్లింల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (రజి) గారంతటి వారే ఆ స్త్రీలను (అందంగా అలంకరించుని సువాసన పూసుకుని వచ్చేవారిని) మసీదు నుండి నిరోధించలేక పోయారు. నేడు కొంత మంది ముస్లింలు పరదాలో ఉండే స్త్రీలను మసీదుకు రానివ్వడాన్ని నిరోధించే విషయం మాట్లాడుతారు. వారు హజ్రత్ ఆయిషా గారి ఈ సదాచారంతో గుణపాఠం నేర్చుకోవలసి వుంది. ఇదే సంఘటన వెలుగులో తమ స్థానాన్ని నిర్ధారించుకోవలసివుంది. కొంతమంది, స్త్రీలను మసీదులలో రానివ్వడాన్ని ఒక ఉపద్రవంగా భావిస్తూ, వారిని మసీదుల నుండి నిరోధించుతూ. "మహాప్రవక్త (సఅసం) కాలం, శ్రేయోభిషాలతో కూడుకున్నకాలం కాబట్టి మసీదులలో రాకపోకలు సంగతంగా వుండేవి. కానీ ఇప్పుడు ఆ కాలం లేదు. ఇపుడు మసీదు రాకపోకలు ధర్మసమ్మతంగా లేవు" అని అంటారు.

వీరు మహాప్రవక్త(స) చిట్టచివరి ప్రవక్త అవటం దాని ప్రాముఖ్యాన్ని తెలుసుకుంటే ఎంత బాగుండేది. మహాప్రవక్త (స) చిట్టచివరి ప్రవక్త అవటం మూలన ప్రవక్తగారి ఉమ్మత్‌కు ప్రళయానికి సమీపంలో దజ్జాల్ రూపంలో గొప్ప ఉపద్రవం జరగనుంది. దాన్ని గురించి కూడా దైవప్రవక్త (స) తెలియపరిచారు. కాని దైవప్రవక్త (స) ఏ హదీసు ద్వారా అయినా, స్త్రీలు మసీదులకు రావటం (ఫిత్న) ఉపద్రవంకు కారణం అని సూచించలేదు. ఒకవేళ స్త్రీలు మసీదులకు రావటం అనేది ప్రళయం వరకూ ఉపద్రవానికి కారణం అయితే, మహాప్రవక్త(స) తప్పకుండా దాని గురించి కూడా హెచ్చరించి వుండేవారు. ఏప్రవక్త అయినా తన జాతికి ప్రళయ సమీపంలో జరగబోయే ఉపద్రవం గురించి హెచ్చరిస్తే, ఆ ప్రవక్త అంతకుముందే ఎదురయ్యే ఉపద్రవానికి కారణం కాగలదు అనుకున్నప్పుడు ఒకవైపు ప్రవక్త ఆదేశాన్ని తిరస్కరించటం తప్పనిసరి అయ్యేది. రెండవ వైపు స్త్రీలకు మసీదుల ద్వారా ధార్మిక విద్యా శిక్షణలు పొందటం నుండి పూర్తిగా బంధం తెగిపోతుంది అని అంటే అతిశయోక్తి లేదు. ముస్లిం

సమాజంలో ఇలాంటి ఎంతో మంచి స్త్రీలున్నారు వారికి తమ ఇండ్లలో ధార్మిక విద్యాబుద్ధులు పొందటానికి అవకాశాలు చాలా తక్కువగా వుంటాయి. కాబట్టి స్త్రీలలో వున్న విద్యారాహిత్యం బాగా ప్రబలి వుంది. దీని కారణాల్లో ఒక ముఖ్య కారణం స్త్రీలకు మసీదులతో సంబంధం తెగిపోయింది. మహప్రవక్త(స) గారి ఆదేశం "మీరు మీ స్త్రీలను మసీదులకు రావడాన్ని నిరోధించకండి" అన్నప్పుడు మరొక భావంకూడా ఆయన దృష్టిలో వుండవచ్చు. స్త్రీలు మసీదులలోని ధార్మిక విద్యాశిక్షణలు నాటి ఏర్పాటుతో సంబంధం కలిగివుండాలి. ఎందుకంటే ఇస్లాంలో మసీదులు కేవలం ఆరాధనాలయాలు కాదు. విద్యాశిక్షణలు గరపటానికి నెలవులు కూడాను. ఆవిషయానికి సంబంధించినంతవరకు ప్రవక్తగారి కాలంలోని శ్రేయోభిలాషకు అనువైన కాలం ఇప్పుడు లేదు. ప్రస్తుత కాలం శ్రేయోభిలాషకు తగ్గకాలం కాదు అనుకుంటే ఏమాత్రం సందేహం లేదు. కానీ ఈ విషయం మరవరాదు మహప్రవక్త (స) గారు స్త్రీలకు ధార్మిక విద్యాశిక్షణల సదస్సులతో అనుసంధానం చేయటానికి ఎంత ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చేవారో బుఖారీ, ముస్లింల ఒక ఉల్లేఖనం ద్వారా బాగా అంచనా వేయవచ్చు.

హజ్రత్ ఉమ్మె అతియా గారి ద్వారా ఉల్లేఖింపబడింది. ఆమె ఇలా అన్నారు. " మాకు ఆజ్ఞాపించబడింది - మేము స్త్రీలందరమూ పండుగల సందర్భాలలో ఇంటి నుండి బయలు దేరి ఈద్గాహ్‌కు రావాలని. ఒక వేళ నెలసరికి లోనైనాసరే పరదాలో ఉండి నమాజ్ ప్రదేశానికి కొంచెం దూరంగా వుండండని అన్నారు. దీనికి ఒక స్త్రీ ఇలా అన్నది "ఓ ప్రవక్త! మాలో ఒక స్త్రీకి తన దగ్గర కప్పుకొని బయటకురావటానికి పెద్ద దుప్పటి లేదు మరి (ఆమె మస్జిద్‌కు ఎలా వస్తుంది)? దానికి దైవప్రవక్త (స) "ఆమె తోటిస్త్రీ తన దుప్పటిని ఆమెకు కూడా కప్పి తీసుకురావాలి" అని అన్నారు.



పండుగ నమాజ్‌లలో ముఖ్యమైన ప్రసంగాలు ఉండేవి. కాబట్టి మహప్రవక్త (స) స్త్రీలను కూడా సమావేశపరచమని ఆజ్ఞాపించేవారు ప్రసంగాలు వినేందుకు. నెలసరికిలోనైన స్త్రీలను కూడా సమావేశపరచమని తాకీదు చేశారు. పరదా ఆజ్ఞలు అవతరించిన తరువాత ఈ ఆదేశం ఇవ్వబడిందన్న విషయం కూడా ఉల్లేఖనాల ద్వారా స్పష్టంగా తెలుస్తుంది. స్త్రీలకు మసీదుల్లోకి రావటం వారి ధార్మిక హక్కుగా, విద్యాశిక్షణలు పొందే ముఖ్యమార్గంగా ఉంది. ఈ హక్కు నుండి వంచితులుగా చేయటం అధర్మం. ప్రస్తుత కాలంలో భద్రత దృష్ట్యా స్త్రీల ప్రవేశం పురుషుల ప్రవేశం మసీదులో వేరుగా వుంచాలి. ఇంకా వారి వరుసల మధ్యలో ఏదైనా (తెర) ఏర్పాటు చేయాలి. స్త్రీలు పురుషులను చూడకుండా పురుషులు స్త్రీలను చూడకుండా మందపాటి గుడ్డగాని, ఒక్క ఇటుక గోడగానీ వుండవచ్చు.

స్త్రీల వరుసలు పురుషుల వరుసల కంటే వెనుక వుండాలి. లేదా కుడి ఎడమలు కూడా వుండవచ్చు. ఇమామ్ కంఠస్వరం వారివరకు చేరకపోతే మైకు ఏర్పాటు చేయవచ్చు. ప్రవక్త కాలంలోని ఏర్పాట్లకు, ఈ కాలంలోని ఏర్పాట్లకు మధ్య తేడా చూస్తే నిరోధించేవారికి వాస్తవం తెలిసిపోతుంది. మహప్రవక్త గారి కాలంలో వరుసల మధ్య ఏమీ పరదా వుండేదికాదు. కేవలం స్త్రీ ల వరుసలు పురుషుల-పిల్లల వరుసలకు వెనుక వుండేవి. ఇస్లామీయ చరిత్రలో ఈ విషయం నిరూపించబడింది.

**"వమా అలైనా ఇల్లల్ బలాగుల్ ముబీన్"**